సాక్షి పల్నాడు

గురువారం । 30 । జనవరి । 2025



31 నుంచి ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: సాతులూరు గ్రామదేవతల ఆలయ పదో వార్షికోత్సవం ఈ నెల 31వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 5న వసంతోత్సవం ఉంటుందన్నారు.



2న కోటి నామోత్సవం

మాచర్ల: గుంటూరు రోడ్డులో ఫిబ్రవరి 2న శ్రీ భగవాన్ గీతా యజ్ఞం - కోటి నామోత్సవాన్ని జయప్రదం చేయాలని పరబ్రహ్మ కాశీ విశ్వనాథ స్వామి సత్సంగ సభ్యులు ప్రచారం చేశారు.



వైభవంగా కల్యాణ మహోత్సవం

తెనాలి రూరల్: సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీవారి శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు.

మళ్లీ అదే రీసర్వే!

'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో భూములు లాగేసుకుంటారు.. వారసత్వంగా వచ్చిన భూములకు రీ సర్వే అవసరమా? యాక్ట్ అంతా మోసం' అంటూ ఎన్నికల ముందు రాద్ధాంతం చేసిన కూటమి నేతలు ఇప్పుడు అదే రీసర్వేకు సిద్ధమయ్యారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసినట్లు చెప్పిన ప్రభుత్వం నేడు తిరిగి వైఎస్ జగన్ బాటలోనే అడుగులు వేస్తోంది. భూ సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు.. భూ రక్ష పథకం పేరును ఏపీ రీసర్వేగా మార్చి కొనసాగించాలని నిర్ణయించింది.

- వైఎస్ జగన్ బాటలోనే కూటమి ప్రభుత్వం
- హద్దు రాళ్లపై పేర్లను తొలగించటమే లక్ష్యం
- జిల్లాలో 25 గ్రామాల్లో సర్వే నిర్వహణ

అమరావతి: పైలట్ ప్రాజెక్టు కింద మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఈ నెల 20వ తేదీ నుంచి రీ సర్వే మొదలు పెట్టారు. బ్రిటిష ప్రభుత్వ హయాంలో సర్వే చేయగా.. మళ్లీ ఇప్పుడు సర్వే చేసి అన్నదాతలకు ఇబ్బంది లేకుండా చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పించింది. రీసర్వేతో పాటు రికార్డుల ప్యూరిఫికేషన్‌కు శ్రీకారం చుట్టింది. పల్నాడు జిల్లాలోని 28 మండలాలలో మూడు విడతల్లో 349 గ్రామాలకుగాను 150 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసింది. రెండు లక్షల మందికిపైగా రైతులకు భూ హక్కు పత్రాలు ఇచ్చింది. మిగతా గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉండగా ఎన్నికలు జరగడంతో నిలిచి పోయింది. జిల్లాలో రెండు విడతలలో 3,87,822 ఎకరాలను సర్వే చేసి హద్దు రాళ్లు పాతారు. ప్రస్తుతం రీసర్వే పూర్తయి భూముల సరిహద్దు రాళ్లపై ఉన్న పేరును తుడిచి వేయటానికి పాలకులు నిర్ణయించారు. రాళ్లపై ఉన్న అక్షరాలు తొలగించటానికి రూ. కోట్లు ఖర్చు చేయటానికి సిద్ధమయ్యారు.

మండలానికో పైలట్ గ్రామం ఎంపిక

జిల్లాలోని 25 గ్రామాలలో రీసర్వే డీటీలు, మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లు బృందాలు సర్వే చేస్తున్నారు. మాచర్ల మండలంలో ముత్యాలంపాడు, కారంపూడి - చినకొదమగుండు, రెంటచింతల - మల్లవరం, గురజాల - పల్లెగుంత, దుర్గి - దుర్గి, పిడుగురాళ్ళ- జానపాడు, దాచేపల్లి - పొందుగల, మాచవరం - తాడుట్ల, వెల్దుర్తి - మండాది, అచ్చంపేట- కస్తల, బెల్లంకొండ - వెంకటాయపాలెం, క్రోసూరు - అందుకూరు, అమరావతి - నరుకుళ్ళపాడు, పెదకూరపాడు - లింగంగుంట్ల, సత్తెనపల్లి - కంకణాలపల్లి, ముప్పాళ్ళ - నార్నెపాడు, రాజుపాలెం - గణపవరం, నెకరికల్లు - చాగల్లు, బొల్లాపల్లి - సరికొండపాలెం, నూజెండ్ల - త్రిపురాపురం, రొంపిచెర్ల - గొగులపాడు, చిలకలూరిపేట - కావూరు, శావల్యాపురం - కొత్తలూరు, ఈపూరు - కొచ్చెర్ల, వినుకొండ మండలంలో ఏనుగుపాలెంలో సర్వే చేయనున్నారు.



ఎండ్రాయి గ్రామంలో 2020లో సర్వే ప్రారంభ దృశ్యం



నరుకుళ్ళపాడులో ప్రస్తుతం రైతులకు వివరిస్తున్న అధికారులు



అమరావతిలో నిల్వ ఉంచిన పాత సర్వే రాళ్లు

సదస్సులతో ప్రయోజనం శూన్యం



ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన రైతుల సదస్సుల వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. ఇటీవల మొదలు పెట్టిన రీసర్వే కూడా గతంలో చేసిందే. సర్వే రాళ్లపై గత ప్రభుత్వ ఆనవాళ్లను తొలగించటమే రీసర్వే లక్ష్యంగా ఉంది.

– వై. గోపాలరావు, రైతు సంఘం అధ్యక్షుడు, పల్నాడు జిల్లా

సర్వేలో మార్పు లేదు



గతంలో మా పొలంలో సర్వే ఒకసారి రాళ్లు పాతారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు వచ్చి సర్వే చేయాలని పిలుస్తున్నారు. పూర్తయ్యాక అప్పటికి, ఇప్పటికి కొలతలలో తేడా లేదని చెబుతున్నారు.

– దొప్పలపూడి వీరశేఖర్, రైతు, నరుకుళ్ళపాడు, అమరావతి మండలం

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలని ఆదేశాలు ఇచ్చాం. గతంలో చేసిన డ్రోన్ సర్వే, గ్రౌండ్ ట్రూతింగ్ ద్వారా మళ్లీ కొలతలు తీస్తున్నాం. దీని గురించి రైతులకు వివరిస్తున్నాం. అంగీకారం కోసం కృషి చేస్తున్నాం.

– సీహెచ్ భానుకీర్తి, సర్వే ఏడీ, పల్నాడు జిల్లా

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రెండు విభాగాల జిల్లా అధ్యక్షులు నియామకం



ఆకాష్‌కుమార్

నరసరావుపేట: నియోజకవర్గంలో ఇరువురు నాయకులకు పార్టీ అనుబంధ విభాగాలకు జిల్లా బాధ్యతలు అప్పగిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రొంపిచర్ల మండలం వడ్లమూడివారి పాలెంకు చెందిన అన్నెం పున్నారెడ్డిని రైతు విభాగ జిల్లా అధ్యక్షులుగాను, పట్టణానికి చెందిన గుజ్జర్లపూడి ఆకాష్ కుమార్‌ను స్టూడెంట్ విభాగ జిల్లా అధ్యక్షులుగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

విజయకీలాద్రిపై ప్రత్యేక పూజలు



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళా శాసనాలతో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ ఉత్తరాషాఢ నక్ష త్రము, అమావాస్యను పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు భూ వరాహస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించామని, 10 గంటలకు సర్వ గ్రహ దోష నివారణ, ఆయురారోగ్యం కోసం సర్వరక్షాకర (సుదర్శన హోమం) నిర్వహించామని భక్తులు అధిక సంఖ్యలో ఈ హోమ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని వివరించారు.

యార్డుకు 1,05,694 మిర్చి బస్తాలు




కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,05,694 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,01,695 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,500 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.7,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 74,693 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1816 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 106 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 163 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 243 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 176 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 51 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 514 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఏఎన్‌యూ దూరవిద్య డిగ్రీ ఫలితాలు విడుదల



ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ గతేడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించిన డిగ్రీ కోర్సుల ఫలితాలను బుధవారం దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు కార్యాలయంలో ఫలితాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఫలితాల్లో బీఏ, బీకాం (జనరల్), (కంప్యూటర్ అప్లికేషన్స్) ఒకటి, రెండు, మూడో సెమిస్టర్ల రెగ్యులర్, సప్లమెంటరీ ఫలితాలు విడుదల చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఫిబ్రవరి 11లోగా ఒక్కో పేపర్‌కు రూ.770 చెల్లించి, 14లోగా పరీక్షల కో-ఆర్డినేటర్ కార్యాలయానికి దరఖాస్తు అందించాలి.

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

జిల్లా రవాణాశాఖాధికారి సంజయ్‌కుమార్



సత్తెనపల్లి: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా రవాణా శాఖ అధికారి జి. సంజయ్ కుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని కాకతీయ కళ్యాణ మండపంలో జిల్లాలోని స్కూల్, కాలేజీ బస్సు డ్రైవర్లకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. డీటీఓ సంజయ్ కుమార్ మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించడం వల్ల విలువైన ప్రాణాలు కాపాడిన వారమవుతామన్నారు. ఒక వ్యక్తి చనిపోతే ఆ కుటుంబ సభ్యులు పడే బాధను వర్ణించలేమని చెప్పారు. కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యాసంస్థల బస్సు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా నరసరావుపేట, పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.శివనాగేశ్వరరావు, సీహెచ్ రాంబాబు, నరసరావుపేట అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వంశీ, మనీషా, సత్తెనపల్లి టౌన్ సీఐ బి.బ్రహ్మయ్య, సత్తెనపల్లి రూరల్ ఎస్‌హెచ్‌ఓ పోలూరి.శ్రీనివాసరావులు మాట్లాడారు. విద్యా సంస్థలకు చెందిన బస్సులకు సంబంధించి మారిన నియమ నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం డ్రైవర్లకు బీపీ, షుగర్, నేత్ర వైద్య పరీక్షలను ప్రభుత్వ ఏరియా వైద్యశాల వైద్యులు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు తోట ఆంజనేయులు, రవాణా శాఖ సిబ్బంది, స్కూల్, కాలేజ్ బస్ డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరునాళ్లకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశం
- ఆలయ ప్రాంగణంలో సమీక్షా సమావేశం

నరసరావుపేట రూరల్: లక్షలాదిగా భక్తులు తరలివచ్చే కోటప్పకొండ తిరునాళ్లకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 26వ తేదీన కోటప్పకొండలో నిర్వహించనున్న తిరునాళ్ల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో బుధవారం త్రికోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శాఖలవారీగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తాగునీరు, రవాణా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. తగినంత సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు. నడక మార్గంలో టెంట్లు, గ్రీన్ మ్యాట్లు ఏర్పాటుకు ఆదేశించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని చెప్పారు. యూటీ వద్ద ప్రభలు హైటెన్షన్ వైర్లు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఘాట్‌రోడ్డులో అనువైన బస్సులనే నడపాలని సూచించారు. భక్తులకు ఈ మార్గంలో అనుమతి లేదని, మెట్ల మార్గం ద్వారానే కొండమీదకు చేరుకోవాలని తెలిపారు. చిన్నారులు తప్పిపోకుండా ట్యాగ్‌లు వేయాలని సూచించారు. కొండ దిగువన, ఆలయ ప్రాంగణంలో రెండు కంట్రోల్ రూమ్‌లను శాఖల సమన్వయం కోసం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వీఐపీల కోసం ప్రత్యేక బస్సుల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోలేదు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. దేవదాయ శాఖ అదనపు కమిషనర్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. మహాశివరాత్రి రోజున తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామి దర్శనం కల్పిస్తామని తెలిపారు. ఉచిత, శీఘ్ర, వీఐపీ, అభిషేక దర్శనాలకు ప్రత్యేక క్యూలైన్‌లు ఉంటాయని చెప్పారు. భక్తులకు విక్రయించేందుకు 2 లక్షల లడ్డూలు, లక్ష అరిసెలను సిద్ధం చేస్తామని తెలిపారు. పలు డిపోల నుంచి 528 బస్సులను నడపనున్నారు. 2.75 లక్షల వాటర్ ప్యాకెట్లు, 140 తాత్కాలిక మరుగుదొడ్లను అందుబాటులో ఉంచనున్నారు. 500 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు అందిస్తారని డీఈవో చంద్రకళ చెప్పారు. కొండకు చేరుకునే 13 రహదారుల్లో మరమ్మతులు, పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టనున్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఎఫ్‌వో కృష్ణప్రియ, ఆర్‌డీవో మాధవీలత, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు, ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే తదితరులు

హామీలప్పుడు అప్పులు తెలియదా?

- ప్రజలను మోసగించటమే మీ నైజమా?
- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ధ్వజం



మాచర్ల: ఎన్నికల ముందు ప్రజలకు అడ్డగోలు హామీలిచ్చి సూపర్ సిక్స్ పేరుతో అధికారాన్ని పొందిన సీఎం చంద్రబాబు తన నిజ స్వరూపాన్ని ఇప్పుడు బయటపెట్టుకున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సంపద సృష్టిస్తే తప్ప ఖర్చు పెట్టే పరిస్థితి లేదని మాయమాటలు చెప్పి ప్రజలకు మభ్యపెడుతున్నారని పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్‌లు సిగ్గులేకుండా ఆర్థిక పరిస్థితి, గ్రోత్ రేటు బాగుంటే సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పడం తగదన్నారు. ఒక పథకం ప్రకారం ప్రజలను సూపర్ సిక్స్ పేరుతో మోసగించారన్నారు. ఎవరూ ప్రశ్నించకుండా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు, సామాన్యులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. ఇప్పుడు ప్రభుత్వాన్ని ఎవరూ ప్రశ్నించలేరని భావించి, అలా అడిగితే కేసులు వేస్తామని భయపెడుతూ పథకాలు అందవని చెబుతున్నారన్నారు. ఏడు నెలల్లోనే రూ. 1.19 లక్షల కోట్లు అప్పు తీసుకొచ్చారని గుర్తుచేశారు. "మరి ఈ అప్పులతో సంపద సృష్టించలేదే.. ఉద్యోగం ఇవ్వలేదే.. ఒక్క పథకం కూడా అమలు చేయలేదే.. డబ్బులు ఎక్కడికి పోయాయి? వలంటీర్ల తొలగింపు, సచివాలయంలో పోస్టుల కుదింపు, వివిధ కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపు, వైద్యశాఖలో లక్షల మందిని తొలగించటమేనా మీ లక్ష్యం" అని ప్రశ్నించారు. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలు, పోర్టులు, హార్బర్‌లు నిర్మిస్తే వాటిని ప్రైవేటుపరం చేస్తూ, ఇంతవరకు పైసా ఇవ్వకుండా ఎమ్మెల్యేలకు దోచిపెట్టే పనిలో ఉండటమేనా మీ లక్షణమని సీఎంను పీఆర్కే ప్రశ్నించారు. "మీ పార్టనర్ 2, 3 సినిమాలు తీస్తే వందల ఎకరాలు దోచిపెట్టారు, ఇదేనా సంపద సృష్టి?" అని నిలదీశారు. వాగ్దానాలు అమలు చేయలేక ఎమ్మెల్యేలకు దోచిపెట్టేందుకు ఇసుక, మట్టి, మద్యం వంటి విషయాల్లో సంపాదన మార్గం చూపుతున్నారని సీఎం తీరును విమర్శించారు. వైఎస్ జగన్ ఆనాడు ఎన్నికల సమయంలోనే చంద్రబాబు మాయమాటలు విని మోసపోవద్దని ప్రజలు చెప్పారని గుర్తుచేశారు. నీతి ఆయోగ్ నివేదిక పేరుతో సీఎం ఏవో మాయమాటలు చెబుతున్నారని పేర్కొన్నారు. కరోనా కాలంలోనూ వైఎస్ జగన్‌కు ఇవన్నీ గుర్తు రాలేదని, ప్రజలకు విశ్వసనీయతతో పథకాలు అందించటమే ధ్యేయంగా పనిచేశారని చెప్పారు. దానికి విరుద్ధంగా ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టి జిమ్మిక్కులు చేస్తూ ప్రజలను చంద్రబాబు వంచిస్తున్నారని ఆరోపించారు. హామీలిచ్చినప్పుడు ఈ విషయాలు తెలియదా? అని నిలదీశారు. ఇప్పటికైనా మాయమాటలు మాని పేద ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని చెప్పారు.

ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు

- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

గుంటూరు ఎడ్యుకేషన్: శాసనమండలి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు ఫిబ్రవరి 27న జరగనున్నాయి. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 29న పదవీ కాలం ముగియనుండటంతో తూర్పు-పశ్చిమ గోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికలు జరగనున్నాయి. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్న కేఎస్ లక్ష్మణరావు పదవీ కాలం మార్చి 29న ముగియనుండగా, మార్చి 8వ తేదీ నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల చేయనున్న కేంద్ర ఎన్నికల సంఘం ఫిబ్రవరి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనుంది. 11న స్క్రూటినీ అనంతరం, ఉపసంహరణకు 13 వరకు అవకాశం ఉంటుంది. 27న ఎన్నికలు జరుగుతాయి. మార్చి 3న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి చేస్తారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి రెండు జిల్లాల పరిధిలో 3.46 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) తరపున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఉన్న కేఎస్ లక్ష్మణరావు మరోసారి పోటీ చేస్తున్నారు. కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో పాటు మరి కొందరు స్వతంత్ర అభ్యర్థులు పోటీకి సిద్ధమయ్యారు.

ఆధునిక సాంకేతికతతో నేరాలకు అడ్డుకట్ట

డీజీపీ ద్వారకా తిరుమలరావు

నరసరావుపేట: పోలీసు యంత్రాంగం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే నేరాలకు అడ్డుకట్ట సాధ్యమని డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. ఆయన తొలిసారిగా బుధవారం పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు స్వాగతం పలికారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మార్పులను ఐజీ వివరించారు. గౌరవ వందనం స్వీకరించిన తర్వాత కార్యాలయ ప్రాంగణంలో రెండు మొక్కలను నాటారు. నూతనంగా నిర్మించిన డాగ్ స్క్వాడ్ భవనాన్ని ప్రారంభించారు. పోలీసు శునకం అందజేసిన బొకేను స్వీకరించి అభినందించారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేలు మర్యాదపూర్వకంగా కలిశారు. చిన్ననాటి స్నేహితుడైన సత్తెనపల్లికి చెందిన సుబ్బారావు కూడా డీజీపీని కలిసి జ్ఞాపిక అందజేశారు. అనంతరం కలెక్టరేట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పరేడ్ గ్రౌండ్‌ను సందర్శించారు. ప్రత్యేక శిబిరంలో మాట్లాడారు. ప్రస్తుతం సాధారణ నేరాల కంటే సైబర్ నేరాలు పెరిగాయన్నారు. వీటిని అరికట్టడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నేరాలు జరగకముందే అడ్డుకోవడానికి సాంకేతికతను అందరూ వినియోగించుకోవాలని సూచించారు. అత్యాచారాలు నిత్యకృత్యమైన వేళ చాలా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, టీడీపీ ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, భాష్యం ప్రవీణ్, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, యరపతినేని శ్రీనివాసరావులు డీజీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. డాక్టర్ చదలవాడను ప్రశ్నించగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వలన కోటప్పకొండ తిరునాళ్ల సమీక్ష రద్దుకావటంతో తామంతా డీజీపీని ఒకసారి కలిసేందుకు వచ్చామన్నారు. జిల్లా అదనపు ఎస్పీలు జేవీ సంతోష్, సీహెచ్.లక్ష్మీపతి, సత్తిరాజు, ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు, బీఎల్‌ఎన్. జగదీష్, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



డాగ్ స్క్వాడ్ భవనాన్ని ప్రారంభిస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

క్లుప్తంగా

ఉపాధ్యాయులు వివరాలు సరిచేసుకోవాలి

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు తమ వివరాలలో ఏవైనా తప్పులు ఉంటే ఈ నెల 31వ తేదీలోగా సవరించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ బుధవారం తెలిపారు. ఉపాధ్యాయులు ఇప్పటికే తమ వివరాలను టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఆన్‌లైన్)లో నమోదు చేసారని గుర్తుచేశారు. వాటిలో తప్పులు సవరించుకునేందుకు 31వ తేదీ వరకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చినట్టు వివరించారు. ఉపాధ్యాయులు సీఎస్ఈ వెబ్‌సైట్‌లో తమ వ్యక్తిగత లాగిన్‌లో సరిచేసుకోవాలని సూచించారు. సవరణలకు ఇదే చివరి అవకాశంగా గుర్తించాలని, తదుపరి తప్పులకు సదరు ఉపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

- అలస్యంగా వెలుగుచూసిన దారుణం
- పోలీసుల అదుపులో నిందితుడు

చిలకలూరిపేట: అభం శుభం ఎరుగని ఆరేళ్ల చిన్నారిపై యువకుడు లైంగిక దాడికి యతిన్నంచిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గణతంత్ర దినోత్సవం నాడు ఈ దారుణంచోటుచేసుకుంది. రూరల్ సీఐ బి.సుబ్బా నాయుడు తెలిపిన వివరాల మేరకు... చిలకలూరిపేట మండలంలోని ఓ గ్రామ ఎస్టీ కాలనీకి చెందిన బాలిక తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లిన క్రమంలో ఇతర బాలలతో కలిసి ఆడుకుంటోంది. ఇది గమనించిన అదే ప్రాంతానికి చెందిన 27 ఏళ్ల యువకుడు పాలపర్తి గోవింద్ బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకువెళ్లాడు. ఎంతకూ బాలిక అతని ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో తోటి పిల్లలు ఆ ఇంట్లోకి తొంగి చూడగా బాలికపై లైంగిక దాడికి ప్రయత్నిస్తూ కనిపించాడు. దీంతో ఇరుగుపొరుగు వారికి పిల్లలు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతి

నాగాయలంక: మండలంలోని సంగమేశ్వర్వం శివారు శంకరాపురం గ్రామం నుంచి ఈ నెల 19వ తేదీన చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రం గల్లంతైన మత్స్యకారుడు కోలా నాంచారయ్య(35) మృతదేహం పది రోజుల తరువాత ఏటిమొగ పంటు ప్లాట్‌ఫారం సమీపంలో లభించిందని ఏఎస్ఐ గణేశ్ బుధవారం తెలిపారు. మండలంలోని పాత ఉపకాలి గ్రామానికి చెందిన నాంచారయ్య మరికొందరు సముద్రంలోకి వెళ్లి చేపల వెళ్లగా నాంచారయ్య ప్రమాదవశాత్తూ జారి సముద్రంలోకి పడిపోయాడు.

సేవా స్ఫూర్తి.. చైతన్య దీప్తి

- ఆదర్శంగా నిలుస్తున్న జనచైతన్య సమితి
- దశాబ్దాలుగా వివిధ సామాజిక సేవలు

పెదకూరపాడు: సామాజిక, ఆరోగ్యకరమైన సేవలు అందిస్తూ అందరి మన్ననలు అందుకుంటోంది జనచైతన్య సమితి. పెదకూరపాడు ప్రాంతానికి చెందిన జనచైతన్య సమితిని 1992లో స్థాపించారు. నిర్వాహకులు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా విశేష సేవలు అందిస్తున్నారు. గుంటూరు, పెదకూరపాడు, అమరావతి, నరసరావుపేట, తెనాలి, బాపట్ల, పిడుగురాళ్ల, అచ్చంపేట, తుళ్ళూరు, వినుకొండ ప్రాంతాల్లో ముఖ్యంగా సేవా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కరోనా సమయంలో వలస కూలీలకు ఈ సంస్థ అండగా నిలిచింది. దీంతో అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ శామ్యూల్ ఆనంద్ నుంచి ఉత్తమ స్వచ్ఛంద సంస్థ అవార్డును కూడా అందుకుంది.

గ్రామీణ మహిళలకు అండగా..

అమరావతి, గుంటూరులోని మంగళదాస్ నగర్, పెదకూరపాడు ప్రాంతాల్లో ఇప్పటి వరకు 2 వేల మందికి టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. నిరుపేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు కూడా అందించారు. సబ్బులు, ఫినాయిల్, బేకరి ఉత్పత్తులు వంటి వాటి తయారీపై మహిళలకు శిక్షణ ఇచ్చి ఆదుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలనీలు, రోడ్ల పక్కన మొక్కలు నాటి పరిరక్షణ బాధ్యతలు తీసుకుంటున్నారు. రోడ్ల పక్కన వ్యర్థాల తొలగింపు వంటి కార్యక్రమాలు చేస్తున్నారు.

ఉచితంగా ఆరోగ్య సేవలు...

జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ కంటి వైద్యశాల, ఎస్ఆర్ఐ లాంటి సంస్థలతో కలిసి ఇప్పటి వరకు 1,500కు పైగా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. 20 సంవత్సరాలుగా ఎయిడ్స్ వ్యాధి నివారణకు తమ వంతు కృషి చేస్తున్నారు. పలువురు బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా యూత్ క్లబ్‌లను నెహ్రూ యువకేంద్ర సహాయంతో ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ వీరు స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. క్రీడాపోటీల నిర్వహణ, చలివేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



అమరావతిలో ఉచిత టైలరింగ్ శిక్షణలో మహిళలు



జిల్లా కలెక్టర్ శామ్యూల్ ఆనంద్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న బెన్నిబాబు (ఫైల్)

పాతికేళ్లుగా సేవలు



గత 25 సంవత్సరాలుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో విశేష సేవలు అందిస్తున్నాం. సంస్థకు, నాకు ఇప్పటి వరకు 6 సార్లు ఉత్తమ సామాజిక సేవకుగాను ప్రభుత్వ అవార్డులు వచ్చాయి. ముమ్ముందు కూడా సేవలు కొనసాగిస్తాం. సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు.

– దాసరి విజయ్ బెన్ని బాబు, జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు

సామాజిక బాధ్యత



సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలి. తోటి వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో సేవలు అందిస్తున్నాం. వృద్ధులకు అండగా ఉంటున్నాం. శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని సేకరించి పేదలకు పంచేందుకు ప్రత్యేక వాహనాలు తీసుకొచ్చాం. భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందిస్తాం

– వెలితోటి అనిల్‌కుమార్, ఉత్తమ సామాజిక సేవ అవార్డు గ్రహీత .

గ్రామీణ కళలపై అవగాహన



అంతరించి పోతున్న గ్రామీణ కళలను బతికించాలని గ్రామాల్లో యువత, మహిళలు, చిన్నారులకు కోలాటం, చెక్క భజనలు నేర్పిస్తున్నాం. ఇప్పటి వరకు వందకుపైగా కోలాట బృందాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీర్చిదిద్దాం. భవిష్యత్‌లో మరిన్ని కళలపై శిక్షణ ఇస్తాం.

– తూళ్ళూరు సాంబశివరావు, ప్రముఖ కోలాట మాస్టర్, జనచైతన్య సమితి కార్యదర్శి

పెన్షనర్లకు మెడికల్ బిల్లులు చెల్లించాలి

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పెన్షన్‌దారులకు మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లులను ప్రభుత్వం త్వరగా మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పల్నాడు జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. పెన్షనర్ల భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు మానం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఆరోగ్య సమస్యలతో పెన్షనర్లు ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం తమ సమస్యలపై దృష్టి సారించి నిధులు విడుదల చేయాలని కోరారు. హెల్త్‌కార్డ్‌లోని తప్పులను సరిచేసుకోవాలని, సకాలంలో ఐటీ రిటర్న్ అందచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు లంకా రంగనాయకులు, ప్రధాన కార్యదర్శి సి.సి.ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ఆర్‌కే ప్రసాదు, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం, మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

2న జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

సత్తెనపల్లి: ఫిబ్రవరి 2న ఉదయం 9 గంటలకు సత్తెనపల్లిలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక ట్రయల్స్ జరుగుతాయని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు బుధవారం తెలిపారు. ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, 4 పాస్‌పోర్ట్ ఫొటోలు, జిరాక్స్ కాపీలు 4, ఒరిజినల్స్ తీసుకుని రావాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ 97010 52588 సంప్రదించాలని సూచించారు.

వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మాట్లాడుతున్న నాసర్‌జీ

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యను వ్యాపారీకరణ చేసేందుకు సిద్ధపడుతున్నదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ విమర్శించారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమాఖ్య జిల్లా సమితి సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యారంగంలో అత్యున్నతమైన వైద్యవిద్యను పేద విద్యార్థుల నుంచి దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని ఆరోపించారు. దానిలో భాగంగానే రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 12 మెడికల్ కళాశాలలను తాము నిర్వహించలేమంటూ జాతీయ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయటం కన్నా దౌర్భాగ్యం మరొకటి లేదన్నారు. ఆయా కళాశాలలను 2025–26 విద్యాసంవత్సరంలో పూర్తి చేసి ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాక ముందు వైద్య విద్యార్థులకు శాపంగా మారిన 107, 108 జీఓలకు రద్దు చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన నారా లోకేష్.. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సదరు జీఓల ఊసే తీసుకురావటం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయం కారణంగా రాష్ట్రంలో వందలాది మెడికల్ సీట్లు కోల్పోయే పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రైవేటు మెడికల్ కళాశాలలకు వత్తాసు పలుకుతున్నట్లుగా ఉందని ఇప్పటికే విద్యార్థులకు, తల్లిదండ్రులకు అర్థమైందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థుల ఉన్నత విద్య ఆశలు అడియాశలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే ప్రారంభిస్తే దాదాపు 1,700 సీట్లు రాష్ట్ర విద్యార్థులకు దక్కే అవకాశం ఉంటుందని వివరించారు. కానీ, ప్రభుత్వం తన ఎన్నికల హామీని విస్మరించి అధికారంలోకి వచ్చిన తరువాత మెడికల్ కళాశాలలను మూసివేసే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు, గుడిపల్లి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు వెనక్కి

ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు డీఈఓ నిర్ణయం

గుంటూరు ఎడ్యుకేషన్: తెనాలి ఐతానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్) ప్రధానోపాధ్యాయురాలితోపాటు ఏడుగురు ఉపాధ్యాయులకు జారీ చేసిన షోకాజ్ నోటీసులను జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం వెనక్కు తీసుకున్నారు. రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో ఏడుగురు ఉపాధ్యాయులు సెలవులో ఉన్న కారణంగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులకు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. కాగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల్లో 50 శాతానికి మించకుండా సెలవు తీసుకోవచ్చునని స్పష్టంగా ఉండటంతో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈఓ రేణుకను బుధవారం డీఈవో కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో హెచ్ఎంతోపాటు ఏడుగురు ఉపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను వెనక్కు తీసుకుంటున్నట్లు డీఈఓ సీవీ రేణుక తెలిపారు. నోటీసులకు సంజాయిషీ లేదని స్పష్టం చేశారు.

బైపాస్ రోడ్డుకు ముగిసిన మార్కింగ్ ప్రక్రియ

- ఐదు గ్రామాల్లో 17 కిలోమీటర్ల మేర మార్కింగ్
- భూములు కోల్పోతున్న రైతుల వివరాల నమోదు



కేసానుపల్లి సమీపంలో మార్కింగ్ నిర్వహిస్తున్న సర్వే సిబ్బంది

నరసరావుపేట రూరల్: బైపాస్ రోడ్డు ఏర్పాటుకు మార్కింగ్ ప్రక్రియ బుధవారం ముగిసింది. మంగళవారం రావిపాడు నుంచి మార్కింగ్ ప్రారంభించి, సాయంత్రానికి జొన్నలగడ్డ వరకు పూర్తి చేశారు. రావిపాడులో ఒక కిలోమీటరు, గుంటగార్లపాడులో కొంత మేర శాటిలైట్ సిగ్నల్ అందక ప్రక్రియ నిలిచిపోయింది. బుధవారం మూడు బృందాలు సర్వేలో పాల్గొన్నాయి. జొన్నలగడ్డ నుంచి కేసానుపల్లి వరకు దాదాపు 7 కిలోమీటర్ల మేర మార్కింగ్ చేశారు. అలాగే మంగళవారం శాటిలైట్ సిగ్నల్ కారణంగా నిలిచిపోయిన రావిపాడులో కొంతభాగం, గుంటగార్లపాడులో కూడా మార్కింగ్‌ను పూర్తి చేశారు. దీంతో కేసానుపల్లి, జొన్నలగడ్డ, నరసరావుపేట, ఇస్సప్పాలెం, గుంటగార్లపాడు, రావిపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలోని 17 కిలోమీటర్ల మార్కింగ్ పూర్తి చేసినట్టయింది. గతంలో హైవే అథారిటీ చేసిన సర్వేలో రహదారి నిర్మాణానికి 60 మీటర్ల మేర భూమిని సేకరించాలని నిర్ణయించి మార్కింగ్ ఇచ్చారు. తాజాగా చేస్తున్న సర్వేలో 45 మీటర్లకు కుదించి మార్కింగ్ చేస్తున్నట్టు సమాచారం. విలువైన భూములను ఇచ్చేందుకు రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుంది. మార్కింగ్ చేస్తున్న సమయంలో హద్దురాళ్లను హైవే అథారిటీ సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారు. మార్కింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో భూ సేకరణపై రెవెన్యూ శాఖ దృష్టి పెట్టారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలను సేకరించనున్నారు. ఈ మేరకు వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేయనున్నారు. వారం రోజుల్లో రైతుల సంఖ్య, పూర్తి విస్తీర్ణం వివరాలు తెలుస్తాయని తహసీల్దార్ వేణుగోపాలరావు తెలిపారు.

పోటాపోటీగా ఎద్దుల బల ప్రదర్శన

ప్రథమ స్థానం పొందిన గుంటూరు, బాపట్ల జిల్లాల గిత్తలు



4 పళ్ల విభాగంలో పోటీ పడుతున్న గుంటూరు గిత్తలు

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి వజ్రోత్సవ తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలు జరిగాయి. 4 పండ్ల సైజ్ విభాగంలో జరిగిన ఈ ప్రదర్శనలో గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన కేలం పద్మానాయుడు గిత్తలు, బాపట్ల జిల్లా మండల కేంద్రమైన జె.పంగులూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు గిత్తలు సమానంగా 3,900 అడుగుల దూరం లాగాయి. ప్రథమ, ద్వితీయ బహుమతులు కలిపి రూ. 70 వేలను కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం మతుకుపల్లి గ్రామానికి చెందిన ముండ్రు జీవప్రసాద్, బాపట్ల జిల్లా మండల కేంద్రమైన సంతమాగులూరుకు చెందిన గిత్తలు 3,711 అడుగుల దూరం లాగి మూడో బహుమతి రూ. 25 వేలు దక్కించుకున్నాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య గిత్తలు 3,705.10 అడుగుల దూరం లాగి 4వ బహుమతి రూ.20 వేలను దక్కించుకున్నాయి. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన ఎం. జయకృష్ణ చౌదరి, నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం నరసపల్లె గ్రామానికి చెందిన దోప్పరి లక్ష్మీదేవి గిత్తలు 3,663.5 అడుగుల దూరం లాగి 5 వ బహుమతి రూ.18 వేలను కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం కోండేపాడు గ్రామానికి చెందిన చాగంటి శ్రీనివాస్ చౌదరి గిత్తలు 3,600 అడుగుల దూరంలాగి 6వ బహుమతి రూ.16 వేలను దక్కించుకున్నాయి. నంద్యాల జిల్లా దువ్వూరు మండలం దాసరపల్లె గ్రామానికి చెందిన నరసింహ గిత్తలు 3,469 అడుగుల దూరం లాగి 7వ బహుమతి రూ. 14 వేలను గెలుచుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లా మండల కేంద్రమైన పెదకొత్తపల్లి గ్రామానికి చెందిన శివ గిత్తలు 3,401.8 అడుగులు లాగి 8వ బహుమతి రూ. 12 వేలను దక్కించుకున్నాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ఎం. నవీన్‌కుమార్, పల్నాడు జిల్లా ఈపూరు మండలం అంగలూరు గ్రామానికి చెందిన ఆర్. హరిబాబు గిత్తలు 3,369 అడుగులతో రూ. 9 వేలను కైవసం చేసుకున్నాయి. ఈ బలప్రదర్శనలో మొత్తం 15 జతలు పాల్గొన్నాయి. మిగిలిన 6 జతలకు కూడ రూ. 3 వేల చొప్పున అందచేసినట్లు కమిటీ సభ్యులు వైఎల్ మర్రెడ్డి, అల్లం ప్రతాప్ రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, బి. రామకృష్ణ, ఓ. ఇన్నారెడ్డి, మూలి రాజారెడ్డి, గాదె కస్పారెడ్డి, కె. జోసఫ్‌రెడ్డి తెలిపారు. న్యాయనిర్ణేతలుగా రాధాకృష్ణ, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాస్ వ్యవహరించారు.

మానవాళి రక్షకుడు క్రీస్తు



పెదకాకాని: మానవాళి రక్షకుడు క్రీస్తు అని బైబిల్ మిషన్ అధ్యక్షులు రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ చెప్పారు. పెదకాకాని మండలంలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట జరిగిన బైబిల్ మిషన్ మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ వాక్యోపదేశం చేశారు. దైవజనులు ఫాదర్ ఎం దేవదాస్ అయ్య చూపిన సువార్త మార్గంలో పయనిద్దామని, క్రైస్తవ రాజ్య స్థాపనకు నడుంబిగిద్దామని వివరించారు. వచ్చే ఏడాది బైబిల్ మిషన్ మహోత్సవం జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు జరుగుతుందని వెల్లడించారు. మహోత్సవాల నిర్వహణకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బైబిల్ మిషన్ మహోత్సవాల నివేదికను అందజేశారు.ముందుగా పశ్చిమగోదావరి జిల్లా సంగీత బృందం ప్రత్యేక గీతాలను ఆలపించింది. బైబిల్ మిషన్ జాయింట్ సెక్రెటరీ రెవరెండ్ ఎం. రవి, రెవరెండ్ డి.ఉజ్జీవం, రెవరెండ్ ఎ.తిమోతి రాజు, పాస్టర్ ఆర్.షాలేము రాజు దైవ సందేశాలు అందించారు. బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.జాన్ దేవదాసు మహోత్సవాల ఆఖరి ప్రార్థన చేశారు. మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ ఆశీర్వాదంతో విజయోత్సవ శబ్దంతో మహోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో బైబిల్ మిషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటపాలెంలో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



వెంకటపాలెం(తాడికొండ): 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు వలపన్ని పట్టుకున్న ఘటన తుళ్ళూరు మండలం వెంకటపాలెంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటపాలెం గ్రామ పరిధిలో రేషన్ బియ్యం నిల్వచేసి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో వెంకటపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డుకు వెళ్ళే అనుసంధాన రహదారిపై ఉంచిన 29 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడులలో బియ్యం బస్తాలు మాత్రమే దొరకడం, అందుకు సంబంధించిన నిందితులెవరూ అక్కడ పట్టుబడకపోవడం విశేషం.

బస్సు ఢీకొని ఇద్దరు విద్యార్థులకు గాయాలు



విద్యార్థిని పరామర్శిస్తున్న డీఈవో చంద్రకళ

నూజెండ్ల(శావల్యాపురం): నూజెండ్ల మండలం బుర్రిపాలెం గ్రామంలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఇరువురు పాఠశాల విద్యార్థులకు గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు మేరకు.. మండల కేంద్రానికి సరైనా రవాణా సౌకర్యం లేకపోవటంతో విద్యార్థుల తల్లిదండ్రుల అభీష్టం మేరకు ఇటీవల ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నారు. ఈ క్రమంలో గ్రామంలోని విద్యార్థులను నూజెండ్ల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు తీసుకొని వచ్చిన బస్సును రివర్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యార్థులను ఢీకొంది. ఈ ప్రమాదంలో 6వ తరగతి విద్యార్థి కత్తి అఖిల్, 7వ తరగతి విద్యార్థి ఏటి అశోక్‌లకు గాయాలు అయ్యాయి. వీరిని 108 ద్వారా ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. వినుకొండ వైద్యశాల్లో చికిత్స పొందుతున్న వారిని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ పరామర్శించారు. వైద్యాధికారితో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆర్టీసీ డ్రైవరు సమయస్ఫూర్తితో వ్యవహరించటంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

3న షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం



మంగళగిరి (తాడేపల్లిరూరల్): పెదవడ్లపూడిలోని సత్యషిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని ఫిబ్రవరి 3న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరు నాగభూషణం తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 3న ఉదయం 5 గంటలకు కాగడ హారతితో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, సుమారు 70 వేల మందికి అన్నదానం నిర్వహించనున్నామని వివరించారు. ఈ వార్షికోత్సవంలో జబర్దస్త్ కామెడీ షో కళాకారుల ఆధ్వర్యంలో హాస్యవల్లరి, సినిమా సంగీత గాయకులతో సంగీత విభావరి, డూప్ స్టార్ మ్యూజిక్ షో వంటిసాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నామని, భక్తులు సాయినాథుని దర్శించి బాబా కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సిద్ధం

- ఫిబ్రవరి ఐదు నుంచి ఒకేషనల్ కోర్సులకు..
- 10 నుంచి సైన్స్ కోర్సులకు..



ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఫిబ్రవరి 5 నుంచి ఒకేషనల్, 10 నుంచి సైన్స్ కోర్సుల విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్) జరగనున్నాయి. ఈమేరకు ఇంటర్మీడియెట్ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 26,308 మంది సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఫిబ్రవరి 10 నుంచి 20 వరకు, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర కోర్సుల వారీగా 2,082 మంది విద్యార్థులకు ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా 119 కళాశాలల్లో ఏర్పాట్లు చేశారు. మొత్తం 119 కళాశాలల్లో నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కాగా, మిగిలిన వాటిలో ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా ప్రాక్టికల్స్ జరగనుండగా, హాల్ టిక్కెట్లు మరో మూడు రోజుల్లో రానున్నట్లు ఆర్ఐఓ జీకే జుబేర్ తెలిపారు. కాగా నాన్ జంబ్లింగ్ విధానంలోప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.